క్లుప్తంగా

వినుకొండ కొండపై త్వరలో నిత్యాన్నదానం



వినుకొండ(నూజెండ్ల): పట్టణంలోని ఏనుగు పాలెం రోడ్డులోని కాశినాయన ఆశ్రమం కమిటీ ఆధ్వర్యంలో వినుకొండ కొండపై నిత్య అన్నదాన కార్యక్రమం త్వరలో నిర్వహించేందుకు రామలింగేశ్వరస్వామి దూత కాశినాయన నిత్య అన్నదాన సేవా సంస్థను నెలకొలిప్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. ఈ మేరకు ఆదివారం అన్నదానానికి సంబంధించిన వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆశ్రమం నిర్వాహకులు కాంతారావు, గుంటూరు అమ్మ ట్రస్ట్ స్వామి బాబా నంద్యాల రామచంద్ర, ఎస్. రామిరెడ్డి, బి.వెంకటరెడ్డి, కూచిపూడి సుబ్బారావు, సీహెచ్. అంజనేయ రెడ్డి, ఎస్.రామిరెడ్డి, బి.రమేష్‌బాబు, ఎస్. గురునాథం, ఎం.రాముడు, బి.కృష్ణారెడ్డి, జి.రాజు, ఎస్.బుచ్చిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆలయ పునర్నిర్మాణానికి విరాళం



నరసరావుపేట రూరల్: ఇస్సప్పాలెంలో వేంచేసియున్న మహంకాళి అమ్మవారి ఆలయ పునర్నిర్మాణానికి నరసరావుపేటకు చెందిన బొమ్మిరెడ్డి రాఘవమ్మ రూ.1,00,116 విరాళంగా అందజేశారు. ఆలయ కార్యాలయంలో ఆదివారం విరాళం మొత్తాన్ని ఈఓ టి.సుధాకర రెడ్డికి దాత రాఘవమ్మ అందించారు. తన భర్త వెంకటేశ్వరరెడ్డి జ్ఞాపకార్థం విరాళాన్ని అందించినట్లు రాఘవమ్మ తెలిపారు. త్వరలో ప్రారంభం కానున్న ఆలయ పునర్నిర్మాణానికి దాతలు విరాళాలు అందజేసి సహకరించాలని ఈఓ సుధాకరరెడ్డి కోరారు. విరాళాలు అందించే దాతలకు ఆదాయపు పన్ను మినహాయింపు ఉంటుందని తెలిపారు. ఆలయ కమిటీ మాజీ సభ్యుడు వంకా శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అరుణాచలంకు ప్రత్యేక బస్సు సర్వీసు

వినుకొండ(నూజెండ్ల): ఈ నెల 31వ తేదీ మహాపౌర్ణమి సందర్భంగా సుప్రసిద్ధ అరుణాచలం స్వామి వారి దర్శనం, గిరిప్రదక్షిణ చేసుకొనుటకు వినుకొండ డిపో నుంచి ప్రత్యే సూపర్ లగ్జరీ బస్సు ఏర్పాటు చేసినట్లు డీఎం కోటేశ్వరరావు నాయక్ తెలిపారు. ఆగస్టు 29వ తేదీ సాయంత్రం 9గంటలకు బయలుదేరి 30వ తేదీ ఉదయం శ్రీకాళహస్తి, మధ్యాహ్నం 12గంటలకు కాణిపాకం వినాయక దర్శనం, సాయంత్రం 6గంటలకు శ్రీపురం గోల్డెన్ టెంపుల్, ఆగస్టు 31వ తేదీ ఉదయం 5గంటలకు అరుణాచలం దర్శనం కొరకు చేరుకొని తిరిగి సెప్టెంబరు 1వ తేదీ ఉదయం 4గంటలకు వినుకొండకు చేరుతుందని తెలిపారు. టిక్కెట్ ధర ఒక్కొక్కరికి రూ.2,550లుగా నిర్ణయించామని, ముందస్తుగా రిజర్వేషన్ సదుపాయం ఉందని ఆయన తెలిపారు. మరిన్ని వివరాలకు 7382895527, 7382898320 నంబర్లను సంప్రదించాలన్నారు.

4 ఎకరాల్లో పశుగ్రాసం దగ్ధం

బొల్లాపల్లి: అగ్నిప్రమాదంలో 4 ఎకరాల పశుగ్రాసం దగ్ధమైన సంఘటన మండలంలోని వడ్డెంగుంట గ్రామంలో ఆదివారం జరిగింది. సేకరించిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన కర్పూరపు మల్లికార్జునరావు 4 ఎకరాల్లో పశుగ్రాసం సాగు చేస్తున్నాడు. అయితే ఒక్కసారిగా పొలంలో మంటలు చెలరేగి 4 ఎకరాల్లో పశుగ్రాసం పూర్తిగా కాలి బూడిదైంది. సమాచారం తెలుసుకున్న వినుకొండ అగ్నిమాపక సిబ్బంది సంఘటనా ప్రాంతానికి వెళ్లి మంటలను అదుపు చేశారు. సుమారు రూ.లక్ష ఆస్తి నష్టం వాటిల్లినట్లు బాధితుడు తెలిపాడు.

పోషకాహారంపై అవగాహన సదస్సు

శావల్యాపురం: అంగన్‌వాడీ సెంటర్లలో గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు ప్రభుత్వం అందించే పోషకాహాన్ని సద్వినియోగం చేసుకోవాలని సెక్టారు సూపర్‌వైజర్ కుప్పం శ్రీలలితా ఆదివారం అన్నారు. ఈసందర్భంగా సూపర్‌వైజర్ మాట్లాడుతూ ఈనెల 7 వరకు ప్రభుత్వ నిబంధనలు మేరకు తల్లిపాల వారోత్సవాలతో పాటు పోషకాహారంపై గర్భిణులు, బాలింతలు అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నామన్నారు. ప్రతి అంగన్‌వాడీ సెంటర్‌లలో టేక్ హోమ్ రేషన్ విధానం ప్రభుత్వం అమలు చేసిందన్నారు. మండలంలోని 46 అంగన్‌వాడీ సెంటర్లు ఉన్నాయని అందులో గర్భిణులు-206, బాలింతలు-175 మందికి లబ్ధి చేకూరతుందన్నారు. ఒక్కో గర్భిణి, బాలింతకు ప్రతి నెలకు 3 కేజీల రైస్, కందిపప్పు-కేజీ, ఆయిల్-500 గ్రాములు, కోడిగుడ్లు 25, వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లు మంజూరు చేస్తుందన్నారు. ఇవన్నీ పారదర్శకంగా లబ్ధిదారులకు నేరుగా అందేలా ఆన్‌లైన్ విధానంలో ఫొటో తీసిన తదుపరి నేరుగా పోషకాహారం కిట్లు అందజేస్తామన్నారు.

పశు పోషణకు భరోసా

- జీవాలు, పశువులకు ప్రయోగశాల
- మూగ జీవాలకు సోకే వ్యాధులపై నిర్ధారణ పరీక్షలు
- తగిన మందులను సూచించి పశుసంపద వృద్ధికి కృషి



గురజాలలో ప్రారంభించిన పశువ్యాధి నిర్ధారణ కేంద్రం

గురజాల : వ్యవసాయానికి , రైతుల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యతనిస్తూ రాష్ట్ర ప్రభుత్వం పశుపోషణపై కూడా దృష్టి సారించి పశుపోషకులకు అండగా నిలుస్తోంది. ప్రతి నియోజకవర్గంలో ప్రభుత్వం ప్రారంభించిన పశువ్యాధి నిర్ధారణ కేంద్రాలు ద్వారా పశువులకు సంక్రమించే వ్యాధులు, వాటి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వినియోగించాల్సిన మందులు తదితర అంశాలపై పరీక్షలు నిర్వహించే విధంగా ఏర్పాట్లు చేశారు. దీని ద్వారా పశు పోషకులు తమ పశు సంపదను పరిరక్షించుకునే అవకాశం కలుగుతుంది. రైతులు వ్యవసాయంతో పాటు పాడి పరిశ్రమ పై జీవనాధారం పొందుతున్నారు. కాలక్రమంలో పశు సంపద పెరిగినట్లుగానే వాటికి సంక్రమించే వ్యాధుల సంఖ్య కూడా పెరుగుతుంది.

పాడి పరిశ్రమ వృద్ధికి కృషి...

ఈ నేపథ్యం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం వ్యవసాయానికి ప్రాధాన్యతనిచ్చిన ట్లుగానే పాడి పరిశ్రమకు కూడా ప్రాధాన్యతనిచ్చే విదంగా ప్రతి నియోజకవర్గంలో ఒక పశువ్యాధి నిర్ధారణ కేంద్రాలను అందుబాటులోకి తీసుకువచ్చారు. వ్యాధుల భారిన పడి పశువులు అకాల మృత్యువాత చెందకుండా కృషి చేస్తున్నారు. పాడి రైతుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని పశువులను రక్షించే రక్షణలో భాగంగా ప్రతి నియోజకవర్గంలో పశు వ్యాధి నిర్ధారణ కేంద్రాలను ఏర్పాటు చేసి మూగజీవాల పాలిట దైవంగా మారారు. ప్రతి నియోజకవర్గ కేంద్రంలో ఒక వ్యాధి నిర్ధారణ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. దీని వల్ల పశువులు వ్యాధుల బారిన పడితే సులభంగా కేంద్రాలకు తరలించి వైద్యం చేయించేందుకు అవకాశం కలుగుతుంది.

ప్రయోగాలు ఇలా...

పశువుల మూత్రం, పేడ, చర్మ సమస్యలకు సంబంధించిన నమూనాలను ఈ ప్రయోగశాలలో పరీక్షించివ్యాధి లక్షణాలు గుర్తిస్తారు. వీటితో పాటు పశువులకు పలు రకాల టీకాలు వేసేలా వాటి పనితీరు, పశువుల్లో ఏదైనా వైపరీత్యాలు సంభవిస్తే వాటిని పరిశీలించడం లాంటివి. ఈ ప్రయోగశాలల్లో జరుపుతారు. అదేవిధంగా పశువుల నుంచి ప్రజలకు సంక్రమించే వ్యాధులను గుర్తించే విధంగా ఏర్పాట్లు చేశారు. పాలు, రక్తనమూనాలు, యాంటీబయోటిక్ నిర్ధారణ పరీక్షలులను రక్తనమూనాలు సేకరించి ఏ యాంటీ బయోటిక్ మందు ఇస్తే పశువుకు వ్యాధి తగ్గుతుంది గుర్తించడం వ్యాధుల బారిన పడి మృతి చెందిన పశువులకు శవ పరీక్షలు , ఇలాంటివన్నీ ఈ ప్రయోగశాల్లో నిర్వహిస్తారు. గొర్రెలు, మేకలుకు సోకే నట్టల నిర్ధారణకు , దానికి తగువైన మందులు ఇచ్చేందుకు అక్కడ ప్రయోగాలు జరుగుతాయి. అదే విదంగా కోళ్లకు సంబందించిన వ్యాధులను కూడా గుర్తించడం జరుగుతుంది.



నిర్ధారణ కేంద్రంలో రక్త పరీక్షలు నిర్వహించేందుకు ఏర్పాటుచేసిన పరికరాలు



నిర్ధారణ కేంద్రంలో పరికరాలు

జిల్లాలో పశువులు వివరాలు ఇలా.....	
పశువుల	సంఖ్య
ఆవులు	66072
గేదెలు	467046
గొర్రెలు	469424
మేకలు	156291

నాడు అలా....నేడు ఇలా...

గతంలో వ్యాధి నిర్ధారణ కేంద్రం అందుబాటులో లేకపోవడంతో తెలిసిన వైద్యం చేసి మందులు వాడేవారు దీంతో తీవ్ర నష్టం వాటిల్లేంది. మండల కేంద్రాల నుంచి జిల్లా హెడ్ క్వార్టర్‌కు శాంపిల్స్ పంపిచడం ఆ తరువాత ఎప్పటికో రిపోర్టులు రావడం వంటివి జరిగేవి. ఈ లోపు రైతుకు జరగాల్సిన నష్టం జరిగిపోయేది. గతంలో వైద్య సేవలు లేక ఎన్నో పశువులు మృత్యువాత పడిన ఘటనలు కోకొలల్లు. టీడీపీ ప్రభుత్వం హయాంలో పాడి రైతులు పశువుల పోషణ భారంగా ఉండడంతో పశుసంపదలు అమ్ముకున్న సందర్భాలు లేకపోలేదు. ప్రత్యేకించి పల్నాడు ప్రాంతంలో మూగ జీవాల మనోవేదన పట్టించుకునే దిక్కుమొక్కు లేక పశువులు మృతి చెందేవి. సరైన పశువైద్యశాలల్లో డాక్టర్లు సిబ్బంది సక్రమంగా లేకపోవడంతో పశువైద్యం దయనీయంగా ఉండడంతో వైద్యం అందక ఎన్నో ఇబ్బందులు పడిన పరిస్థితి నెలకొంది. దీని వల్ల పశుపోషకులు ఎంతో నష్టం వాటిల్లింది. ఎక్కడో ఒక చోట ఉండే వైద్యశాలకు పశువులను తీసుకువెళ్లాలంటే నరకయాతన అనుభవించాల్సి వచ్చేంది. కానీ నేడు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో పరిస్థితి పూర్తిగా మారిపోయింది. వ్యవసాయం తరువాత ప్రధానమైన పశుపోషణపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. వ్యాధి నిర్ధారణ వైద్యపరీక్షలు, పశువులకు చికిత్స అందించడం తదితర సేవలు అన్ని క్షేత్రస్థాయిలో పశుపోషకులకు అందే విదంగా ఏర్పాట్లు చేశారు. ప్రతి గ్రామంలో సంచార పశు వైద్యశాలలు తిరుగుతూ పశువుల ఆరోగ్య పరిరక్షణపై శ్రద్ధ చూపుతున్నారు. అదే విధంగా రైతు భరోసా కేంద్రాలు, మండల కేంద్రాల్లో పశు వైద్య విభాగానికి సంబంధించిన వైద్యులు, సిబ్బంది, మందులు అందుబాటులో ఉంచుతున్నారు. దీని వల్ల పాడిరైతులకు ఎంతో ప్రయోజనం కలుగుతుంది. ప్రత్యేకించి తాజాగా నియోజకవర్గ కేంద్రాల్లో ఏర్పాటుచేసిన పశువ్యాధి నిర్ధారణ కేంద్రాలు చరిత్రలో నిలిచిపోయే విదంగా ఉన్నాయని పశుపోషకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. పశువుల్లో వ్యాపించే వ్యాధులు, సంతానోత్పత్తి, టీకాలు పాల దిగుబడి పెంచడం తదితర అనేకమైన పశు సంబంధ సమస్యలను ఆయా వ్యాధులను గుర్తించి తొలి దశలోనే వైద్యం అందించే విదంగా చూస్తారు. అత్యాధునిక పరికరాలు, అనుభవం కలిగిన వైద్యులు అందుబాటులో వుంచి పశువులు ఆరోగ్య పరిస్థితి బాగుండే విదంగా చర్యలు చేపట్టారు.

ఉపయోగకరం .....



పశువ్యాధి నిర్ధారణ కేంద్రం పశుపోషకులకు ఎంతో ఉపయోగకరం. పశువులకు ఏదైనా వ్యాధి సోకితే సత్వరమే పశువ్యాధి నిర్ధారణ కేంద్రంలో వ్యాధిని గుర్తించి వెంటనే సత్వరమే పశువులకు చికిత్స చేయించి నష్టం వాటిల్లకుండా చర్యలు తీసుకోనచ్చు. గతంలో పశువులకు వ్యాధి సోకితే జిల్లా కేంద్రానికి శాంపిల్‌ను పంపించాల్సివచ్చేది. కానీ నేడు ఆ పరిస్థితి ఉండదు. సత్వరమే వ్యాధిని గుర్తించి వైద్యం చేయించుకునే అవకాశం రైతులకు ఉంటుంది.

టి నాగ మల్లీశ్వరరావు,
పశు వైద్యశాల ఏడి, గురజాల

వస్త్ర వ్యాపారి అదృశ్యం

నరసరావుపేట టౌన్: వస్త్రవ్యాపారి అదృశ్యంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వన్‌టౌన్ సీఐ అశోక్‌కుమార్ ఆదివారం తెలిపారు. శ్రీరాంపురంకు చెందిన పాలిశెట్టి పవన్ కుమార్ రైల్వే స్టేషన్‌రోడ్డులో స్టేటస్ రెడీమేడ్ దుకాణం నిర్వహిస్తున్నాడు. శుక్రవారం ఇంటినుంచి వెళ్లిన పవన్ తిరిగి రాలేదు. అతని కోసం కుటుంబ సభ్యులు గాలించినా ఫలితం దక్కలేదు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఇంటి నుంచి వెళ్లిపోయి ఉంటాడని కుటుంబ సభ్యులు భావిస్తున్నారు. ఈ మేరకు పవన్‌కుమార్ భార్య సాయిభార్గవి ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

అక్రమ మద్యం కేసులో నిందితుడు అరెస్ట్

నరసరావుపేట టౌన్: అక్రమంగా మద్యం కలిగిన కేసులో నిందితుడిని అరెస్ట్ చేసినట్లు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో ఎస్ఐ సురేంద్రబాబు ఆదివారం తెలిపారు. అందిన సమాచారం మేరకు గోనెపూడి గ్రామంలో తనిఖీలు నిర్వహించి అక్కడ అక్రమంగా 20 బాటిళ్ల మద్యం కలిగి ఉన్న రాజును అరెస్ట్ చేశామన్నారు. ఈ మేరకు నిందితుడిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరిచినట్లు ఎస్ఐ తెలిపారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

నరసరావుపేట టౌన్: వ్యక్తి ఆత్మహత్యాయత్నంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు టూటౌన్ సీఐ వీరేంద్రబాబు ఆదివారం తెలిపారు. బరంపేట జెండా చెట్టు వీధికి చెందిన సయ్యద్ జానీబాషా తోపుడు బండిపై పండ్ల వ్యాపారం చేస్తూంటాడు. సుమారు మూడు నెలల క్రితం భార్య పుట్టిల్లు అయిన తూబాడు గ్రామానికి వెళ్లి ద్విచక్రవాహనంపై వస్తూ రోడ్డు ప్రమాదానికి గురయ్యాడు. సంఘటనలో జానీబాషా తల భాగంలో తీవ్రగాయమైంది. అప్పటి నుంచి మతిస్థిమితం కోల్పోయినట్లుగా ప్రవర్తిస్తున్నాడు. శనివారం ఫ్యాన్‌కు దుప్పటితో ఉరివేసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన భార్య హుస్నేన్‌బీ కత్తితో దుప్పటిను కోసి రక్షించింది. జానీబాషా పరిస్థితి ఆందోళనకరంగా మారటంతో పల్నాడు రోడ్డులోని ఓ ప్రైవేటు వైద్యశాల్లో చేర్పించారు. బాధితుడి పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. ఈ మేరకు బాధితుడి భార్య ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ఎంఎల్ఆర్ ఫౌండేషన్ సేవలు ప్రసంశనీయం

ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణ్‌రావు



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణ్‌రావు

రెంటచింతల: విద్యాభివృద్ధికి, ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు ఎంఎల్ఆర్ ఫౌండేషన్ చేస్తున్న సేవలు ఎంతో ప్రసంశనీయమని ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణ్‌రావు అన్నారు. ఆదివారం స్థానిక సెయింట్ జోసఫ్స్ ఉన్నత పాఠశాల ఆడిటోరియంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. మోదుగు లక్ష్మారెడ్డి స్ఫూర్తితో నెలకొల్పిన ఈ ఫౌండేషన్ కొన్ని సంవత్సరాలుగా పలు సేవా కార్యక్రమాలు చేస్తూ అనేక మందికి ఆదర్శంగా నిలిచిందన్నారు. విద్యార్థులకు నైపుణ్యాభివృద్ధిపై శిక్షణ తరగతులు నిర్వహించి వారిలో ఆత్మవిశ్వాసం పెంపొందిస్తూన్న ఫౌండేషన్ రానున్న రోజుల్లో తన సేవలను విస్తృతంగా చేపట్టాలన్నారు. వైఆర్ఎస్ ఉన్నత పాఠశాలకు 4, ఏపి గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలకు 6, సెయింట్ జోసఫ్స్ ఉన్నత పాఠశాలకు 8, దాచేపల్లి జడ్పీ పాఠశాలకు 8 చొప్పున రూ.7.80 లక్షల విలువైన కంప్యూటర్లు ఫౌండేషన్ అందచేయడం అభినందనీయమన్నారు. అనంతరం ఉపాధ్యాయులను దుశ్శాలవలతో, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మోదుగు మధుసూదన్‌రెడ్డి, డాక్టర్ సుధ, సొసైటీ మాజీ అధ్యక్షులు మోదుగు శ్రీనివాసరెడ్డి, డాక్టర్ ఎంబి చిన్నమ్మ, రొక్కం సాల్మాన్‌రాజు, ఉపాధ్యాయులు తదితులున్నారు.

మానసిక దివ్యాంగులకు అండగా ఉండాలి



నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్న నేతలు

దాచేపల్లి : మానసిక దివ్యాంగులకు ప్రతి ఒక్కరు అండగా ఉండాలని వైఎస్సార్ సీపీ జిల్లా ఎగ్జిక్యూటివ్ సభ్యుడు మందపాటి రమేష్‌రెడ్డి అన్నారు. నారాయణపురంలోని మానసిక దివ్యాంగుల విద్యా కేంద్రంలో చదువుతున్న విద్యార్థులకు మాజీ ఎంపీటీసీ పల్లపు వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో నెల రోజులకు సరిపడే రూ.20 వేలు విలువ చేసే నిత్యావసర సరుకులను ఆదివారం అందజేశారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న రమేష్‌రెడ్డి మాట్లాడుతూ.. దివంగత మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జయంతి సందర్భంగా ఏడాదికి సరిపడే నిత్యావసర సరుకులను ప్రతి నెల ఇవ్వాలని నిర్ణయించుకున్నామని, ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి నాయకత్వంలో ప్రతి నెల నిత్యావసరుకులను అందిస్తునానమని రమేష్ రెడ్డి చెప్పారు. మానసిక దివ్యాంగులకు ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉందని, స్థానికులు కూడా ఈ కేంద్రంలో ఉన్న మానసిక దివ్యాంగుల కేంద్రంను సందర్శించి తొడ్పాటు అందించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ కొమెర బత్తిన విజయ్‌కుమార్, మాజీ ఎంపీటీసీ పల్లపు వెంకటేశ్వర్లు, ముగ్గు మిల్లు అసోసియేషన్ నాయకులు కొప్పుల గురవారెడ్డి, గొట్టం అంజిరెడ్డి, మందపాటి వెంకటరెడ్డి, పల్లపు బాలు, సిస్టర్ రాణి తదితరులు పాల్గొన్నారు.

ఐక్యత లోపం వల్లనే సమస్యలు



సదస్సులో మాట్లాడుతున్న డాక్టర్ శ్రీధర్

సత్తెనపల్లి: పురోహితులు, అర్చకుల్లో ఐక్యత లోపించడం వల్ల అనేక సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని బ్రాహ్మణ ఐక్యవేదిక గౌరవ అధ్యక్షుడు డాక్టర్ గుండ్లపల్లి శ్రీధర్ అన్నారు. శ్రీ వేద గాయత్రి పురోహిత సంఘం ఆధ్వర్యంలో పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాల సంయుక్త పురోహిత ఆత్మీయ సదస్సు పట్టణంలోని మన్నెం రెసిడెన్సీలో ఆదివారం జరిగింది. ఈ సదస్సుకు సంఘ అధ్యక్షుడు కలవకొలను సీతారామశాస్త్రి అధ్యక్షత వహించారు. డాక్టర్ శ్రీధర్ మాట్లాడుతూ పురోహితులు, అర్చకులు సమష్టిగా ఉండాలన్నారు. పురోహితులకు, అర్చకులకు గౌరవం పెరిగేలా వ్యవహరించాలన్నారు. ఈ సందర్భంగా పలు అంశాలపై చర్చించారు. సదస్సులో పలు పురోహిత సంఘాల సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆధ్యాత్మికవేత్త మంచి కంటి వెంకటేశ్వరరావును సత్కరించారు. సంఘ నాయకులు వేదాంతం వెంకట హరినాథ్, అధ్యక్షుడు పెద్దింటి ఫణికృష్ణ, కోశాధికారి అంపిరాయని రాజశేఖర్ శర్మ, రాష్ట్ర నాయకులు కోనంకి మారుతి, సంఘ పూర్వాధ్యక్షుడు సాధువెంకట శివప్రసాద్ శర్మ, మైలవరపు సుబ్బారావు, అన్నవరపు మణికంఠ శర్మ, మోతే పురుషోత్తమ శర్మ, మద్దాలి అనిల్ కుమార్ శర్మ పాల్గొన్నారు.

ఉద్యోగ అవకాశాలు కల్పించాలి

దొడ్లేరు(క్రోసూరు): రాష్ట్ర ప్రభుత్వం యువతకు చదువుకు తగ్గ ఉద్యోగ అవకాశాలు కల్పించాలని డీవైఎఫ్ఐ ఆదివారం డిమాండ్ చేసింది. దొడ్లేరు గ్రామంలో ఏర్పాటు చేసిన డీవైఎఫ్ఐ సమావేశంలో జిల్లా కమిటీ సభ్యుడు టి.ఉదయ్‌కుమార్ మాట్లాడుతూ యువతకు ప్రాధాన్యత కలిగిన ఉద్యోగాలు కల్పించాలన్నారు. ప్రభుత్వం వెంటనే డీఎస్సీ నోటిఫికేషన్ వెలువరించాలని, పాఠశాలల్లో ఉపాధ్యాయపోస్టుల ఖాళీలను భర్తీ చేయాలని కోరారు. ఈ సందర్భంగా దొడ్లేరు గ్రామ డీవైఎఫ్ఐ కమిటీ ఎంపిక చేసినట్లు తెలిపారు. అధ్యక్షుడిగా కోటేశ్వరరావు, కార్యదర్శి మనోజ్‌శాస్త్రి నియమితులైనట్లు వివరించారు.

పాత ప్లాస్టిక్ గోడౌన్‌లో అగ్నిప్రమాదం



నరసరావుపేట: స్థానిక రావిపాడురోడ్డులోని పాలూరి వెంకటరెడ్డికి చెందిన జయవెంకట సత్యసాయి పాత ప్లాస్టిక్ గోడౌన్‌లో ఆదివారం అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. వెంటనే అగ్నిమాపక సిబ్బంది స్పందించి మంటలు ఆర్పేయటంతో పెద్దనష్టం తప్పింది. సమీపంలోని పొలాల వారు తమ పొలాల్లోని ఎండుగడ్డికి పెట్టిన నిప్పు కారణంగా పాత గోడౌన్‌లోని సరుకుకు అంటుకొని మంటలు చెలరేగాయి. అగ్నిమాపక అధికారి ఎంవీ సుబ్బారావు నేతృత్వంలో సిబ్బంది హుటాహుటిన సంఘటనా స్థలానికి వెళ్లి మంటలను అదుపు చేశారు. ఈ ప్రమాదంలో సుమారు రూ.10వేల నష్టం వాటిల్లినట్లు అగ్నిమాపక సిబ్బంది వెల్లడించారు.

అసిస్ట్ ఆధ్వర్యంలో నిత్యావసరాల పంపిణీ



చిలకలూరిపేటటౌన్: పేద మహిళలను ఆదుకోవాలని స్వచ్ఛంద సేవా సంస్థ అసిస్ట్ డైరెక్టర్ జాష్టి రంగారావు చెప్పారు. అసిస్ట్, సీడ్ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం పట్టణంలోని సుభానినగర్‌లో 300 మంది నిరుపేద ఒంటరి మహిళలకు రూ. 6లక్షల విలువైన నిత్యావసర సరకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రంగారావు మాట్లాడుతూ పేదల అభ్యున్నతికి తమ సంస్థ దోహదపడుతుందన్నారు. సంస్థ సభ్యులు అస్మా, కమాల్, అబ్దుల్లా, జాష్టి కృష్ణహరీష్, మూర్తి, విష్ణుప్రియ పాల్గొన్నారు.

రైతు శ్రేయస్సే ప్రభుత్వ ధ్యేయం

ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి



ముత్యాలంపాడులో గోడౌన్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి

దాచేపల్లి : రైతు శ్రేయస్సే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని గురజాల శాసన సభ్యుడు కాసు మహేష్‌రెడ్డి అన్నారు. మండలంలోని ముత్యాలంపాడులో కేంద్ర సహకార పరపతి సంఘం ఆధ్వర్యంలో రూ.45 లక్షల వ్యయంతో నిర్మించిన గోడౌన్‌ను ఆదివారం ఆయన ప్రారంభించారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు అన్ని విధాలుగా సేవలు చేసేలా ప్రభుత్వం ఏర్పాట్లు చేసిందని ఎమ్మెల్యే కాసు చెప్పారు. విత్తనాల, ఎరువులు, పురుగు మందులు కూడా ఆర్బీకేల్లో లభిస్తున్నాయని, సాగు చేస్తున్న పంటల్లో అధిక దిగుబడులు తీసుకువచ్చేందుకు ఆర్బీకే సిబ్బంది రైతులకు సలహాలు, సూచనలు ఇస్తున్నారన్నారు. ముత్యాలంపాడులో నిర్మించిన ఈ గోడౌన్ రైతులకు ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని, రైతులు పండించే పత్తి, మిరప, వరి బస్తాలను ఇక్కడ భద్ర చేసుకొవచ్చునని ఎమ్మెల్యే కాసు చెప్పారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు బత్తుల లింగారెడ్డి, జెడ్పీటీసీ మూలగొండ్ల ప్రకాష్ రెడ్డి, ఎంపీపీ కటకం జయశ్రీ, మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ గొట్టిముక్కల పెదహనిమిరెడ్డి, వైస్ ఎంపీపీలు కందుల జాను, తండా అబ్దుల్‌సత్తార్, సర్పంచ్ నెమలికంటి వెంకటచారి, ఎంపీటీసీ పాస వెంకటనాగయ్య, పార్టీ మండల కన్వీనర్ కోట కృష్ణ, పరపతి సంఘం సీఈఓ సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

పలువురు వైఎస్సార్ సీపీలో చేరిక



పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి

దాచేపల్లి : మండలంలోని తక్కెళ్లపాడు గ్రామంలో టీడీపీ చెందిన పలువురు ఎమ్మెల్యే కాసు మహేష్ రెడ్డి సమక్షంలో ఆదివారం వైఎస్సార్ సీపీలో చేరారు. గ్రామానికి చెందిన కిచ్చంశెట్టి వెంకటేశ్వర్లు, రామచంద్రరావు, బ్రహ్మయ్య, మల్లయ్య, చాప అప్పారావు తదితరులు కుటుంబం సభ్యులు, బధువులతో కలిసి వైఎస్సార్ సీపీలోకి వచ్చారు. పార్టీలో చేరిన వారందరికి ఎమ్మెల్యే కాసు పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి చేస్తున్న అభివృద్ధికి ఆకర్షితులమై టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలోకి చేరామని వారు చెప్పారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ కోట కృష్ణ, మాజీ సర్పంచ్ మందపాటి రమేష్‌రెడ్డి, గ్రామ కన్వీనర్ మేడతి నరసింహారావు, ఎంపీటీసీ జంగిలి నరసింహారావు, మాజీ ఎంపీటీసీ గుడూరి గోవర్ధన్‌రావు, నాయకులు రాచకొండ కోటయ్య, గుడూరి వీరాస్వామి, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

సాగరమాత దేవాలయంలో భక్తుల సందడి



ఆలయ ప్రాంగణంలో తేరు ప్రదక్షణలో పాల్గొన్న భక్తులు

విజయపురిసౌత్: సాగరమాత ఆలయంలో ఆదివారం భక్తుల సందడి నెలకొంది. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు సాగరమాత పుణ్యక్షేత్రానికి తరలి వచ్చారు. మతసామరస్యానికి ప్రతీకగా నిలిచే సాగరమాత ఆలయంలో భక్తులు మొక్కుబడులు జరుగుతున్నాయి. ఉదయం భక్తులు కృష్ణానదిలో స్నానమాచరించి ఆలయ విచారణ గురువులు పామిశెట్టి జోసఫ్ బాలసాగర్ ఆధ్వర్యంలో నిర్వహించిన దివ్యబలి పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం దేవాలయ ఆవరణలో తేరు ప్రదక్షణ నిర్వహించారు. ఆ తరువాత జపమాల క్షేత్రంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

మెరుగైన వైద్య సేవలందించాలి

నాదెండ్ల: గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు ఆర్ఎంపీలు మెరుగైన వైద్య సేవలందించాలని నరసరావుపేట లైఫ్‌లైన్ హాస్పటల్స్ అధినేత డాక్టర్ పేరం రాజానందరెడ్డి చెప్పారు. నాదెండ్ల మండలం సాతులూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం ఆర్ఎంపీ, పీఎంపీ వైద్యులకు సీజనల్ వ్యాధుల నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు ఆర్ఎంపీ వైద్యుల వద్దనే వైద్య సేవలు పొందుతారన్నారు.
ప్రస్తుతం సీజనల్ వ్యాధులు ఎక్కువగా ఉన్నందున అందుకు తగిన వైద్య చికిత్స, మందులపై అవగాహన కలిగిఉండాలన్నారు. ఈసందర్భంగా వైద్యులను ఆర్ఎంపీలు శాలువాలతో సత్కరించారు. హాస్పటల్ వైద్యులు రాజ్యలక్ష్మి, ప్రసన్నలక్ష్మి, ఆర్ఎంపీ, పీఎంపీల డివిజల్ అధ్యక్షులు షేక్ బాజీ, ఆరేటి నాగేశ్వరరావు, నాదెండ్ల, చిలకలూరిపేట రూరల్ మండలాల అధ్యక్షులు షేక్ నాగూర్‌వలి, ఎస్ రాజు, కార్యదర్శి ఆవుల శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులు జగన్ మోహన్‌రావు, రామారావు, ట్రెజరర్ హనుమయ్య ఉన్నారు.